క్లుప్తంగా

ప్రత్యేక పూజలు



నర్సంపేట : వరంగల్ పట్టణంలోని భద్రకాళి అమ్మవారిని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి బుధవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎమ్మెల్యే దంపతులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నియామకం



లక్క విజేందర్

చెన్నారావుపేట : చెన్నారావుపేట గ్రామ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లక్క విజేందర్‌ను ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు నియమించినట్లు మండల అధ్యక్షుడు భూక్యా గోపాల్ నాయక్, గ్రామ అధ్యక్షుడు తాళ్లపెల్లి నర్సయ్య గౌడ్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా విజేందర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, పార్టీ మండల, గ్రామ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఎర్రగొల్ల యాదవ సంఘం కార్యవర్గం..



రవియాదవ్, అధ్యక్షుడు



ప్రభాకర్, కార్యదర్శి

ఖానాపురం : మండలంలోని ధర్మరావుపేటలో ఎర్రగొల్ల యాదవ సంఘం నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. పెద్ద గొల్లగా మామిండ్ల సాయిలు యాదవ్, సారీ గొల్లగా లెంకలపల్లి మల్లయ్య యాదవ్, అధ్యక్షుడిగా లెంకలపల్లి రవి యాదవ్, కార్యదర్శిగా రాజబోయిన ప్రభాకర్, ఉపాధ్యక్షుడిగా కన్నబోయిన చిరంజీవి, కోశాధికారిగా బండి రాజు, సహాయ కార్యదర్శి భాషబోయిన అశోక్, ముఖ్య సలహాదారులుగా కన్నబోయిన వీరన్న, ఉడుగుల వీరమల్లు, బండి వెంకన్న, మామిండ్ల వీరస్వామి, బైకాని సాంబరాజు, చిలికాని కొమురయ్య, బైరగుని కొమురయ్య ఎన్నికయ్యారు.

నిరుద్యోగ ఉద్యమ కళాకారుల కమిటీ..




రాయపర్తి (వర్ధన్నపేట) : నిరుద్యోగ ఉద్యమ కళాకారుల జిల్లా కమిటీని బుధవారం వర్ధన్నపేట పట్టణంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముఖ్య అతిథులుగా ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు గడ్డం సుధాకర్, గౌరవాధ్యక్షుడు బుల్లెట్ వెంకన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ పాలాటి రాజు, జిల్లా కార్యదర్శి బిర్రు సురేందర్, ప్రచార కార్యదర్శి హరిబాబు పాల్గొని కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా పాలాటి రమేష్, ఉపాధ్యక్షుడిగా బాస్కూరి రాజు, ప్రధాన కార్యదర్శిగా రాపర్తి యాకూబ్, కోశాధికారిగా గుండెకారి సునీల్, వర్కింగ్ ప్రెసిడెంట్లుగా మంద రాజేందర్, మైదం సుహాసిని, చిన్నపెల్లి ప్రభాకర్, గడ్డం చిరంజీవి, సహాయ కార్యదర్శులుగా వరపట్ల రాజు, రవి, గడ్డం కుమారస్వామి, సూదమల్ల అశోక్, యాడ చంద్రకళ, వల్లందాస్ రంగన్న, తాటికాయల మహేందర్, గుడికందుల క్రాంతిని ఎన్నిక చేసినట్లు తెలిపారు.

ఎస్సైని కలిసిన నాయకులు



నల్లబెల్లి : ఇటీవల బదిలీపై వచ్చిన ఎస్సై ప్రశాంత్‌ను పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్సైని శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేశారు. బత్తిని మహేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్సైకి సన్మానం



దుగ్గొండి : మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లును యూత్ కాంగ్రెస్ మండల నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఒలిగె నర్సింగరావు, బండారి ప్రకాశ్, కొత్తకొండ రవివర్మ, కొల్లూరి రాజు, సుకినె నాగరాజు, డ్యాగం శివాజీ, అజ్మీరా తిరుపతి పాల్గొన్నారు.

మటన్ @750



పర్వతగిరి : మండల కేంద్రంలోని మటన్ షాపుల యజమానులు అధిక ధరలకు మటన్ విక్రయిస్తున్నారని జూన్ 1వ తేదీన 'మటన్@900' అనే కథనం సాక్షిలో ప్రచురితమైంది. దీంతో ప్రజలు కూడా రూ.750కే ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్పందించిన షాపుల యజమానులు రూ.750కు మటన్ అని బోర్డులు ఏర్పాటు చేసి విక్రయిస్తున్నారు.

ఘనంగా బీరన్న బోనాలు



దుగ్గొండి: గిర్నిబావిలో బోనాలతో వెళ్తున్న గొల్లకురుమలు

చెన్నారావుపేట : మండలంలోని పలు గ్రామాల్లో గొల్లకురుమలు బీరన్న బోనాల పండుగను బుధవారం ఘనంగా నిర్వహించారు.గొల్ల కురుమల ఆరాధ్య దైవమైన బీరన్నకు డప్పుచప్పులతో నృత్యాలు చేస్తు ఊరేగింపుగా వెళ్లి ఆలయంలో మొక్కులు చెల్లించి పూజలు నిర్వహించారు. చల్లంగా చూడు బీరయ్య అంటూ వేడుకున్నారు. దీంతో గ్రామాల్లో పండుగ సందడి నెలకొంది. కార్యక్రమాల్లో కులపెద్దలు కుండె కట్టయ్య, సారీ గొల్ల రవి, కుండె సురేష్, పోశాలు, కొమురయ్య, కుమారస్వామి, సుధాకర్, మంగ సదయ్య, రవితేజ, సాంబయ్య, చీర కుమారస్వామి, కంప సారయ్య, రాములు, శివరాజు, తదితరులు ఉన్నారు.

దుగ్గొండిలో..

దుగ్గొండి : మండలంలోని ఆయా గ్రామాల్లో ఏకాదశి పర్వదినం సందర్భంగా బీరన్న బోనాల పండుగను బుధవారం ఘనంగా నిర్వహించారు. తొగర్రాయి, గిర్నిబావి గ్రామాల్లో గొల్లకురుమ సంఘాల ఆధ్వర్యంలో, నాచినపల్లిలో యాదవ సంఘాల ఆధ్వర్యంలో బోనాల వేడుకను నిర్వహించారు. మహిళలు ఇంటి వద్ద బోనాలను అలంకరించుకుని ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న వెదురు గంపలలో బోనాలతో డప్పు చప్పుళ్లతో బీరన్న ఆలయానికి వెళ్లి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో నర్సంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీపీ కాట్ల కోమలభద్రయ్య, కురుమ కులపెద్దలు అన్న లింగన్న, బండారి రాజుకుమార్, గ్రామ కులసంఘాల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

నాగారంలో..

నెక్కొంద : మండలంలోని నాగారం గ్రామంలో గొల్ల కురుమలు బీరన్న బోనాల పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఏటా తొలిఏకాదశి పర్వదిన సందర్భంగా బుధవారం గ్రామానికి చెందిన కురుమ మహిళలు బీరన్న స్వామికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. డోలు వాయిద్యాలతో మహిళలు బోనాలతో నిర్వహించిన శోభాయాత్ర పలువురిని ఆకట్టుకుంది. కురుమ సంఘం గ్రామ అధ్యక్షుడు కంచ ఐలయ్య మాట్లాడుతూ పంటలు సమృద్ధిగా పండాలని, గొల్ల కురుమలు గొర్రెలతో ఆర్థికంగా ఎదగాలని బోనాలు సమర్పిస్తామని తెలిపారు. సంఘం ఉపాధ్యక్షుడు మీరాల కుమారస్వామి, బొట్టు పెద్ద మనుషులు మీరాల మల్లయ్య, పెద్ద కట్టయ్య పాల్గొన్నారు.



చెన్నారావుపేట : బోనాలతో వెళ్తున్న కురుమలు



నెక్కొంద: బోనాలతో వెళ్తున్న మహిళలు

గంగమ్మ తల్లికి బోనాలు



చెన్నారావుపేట : మండలంలోని కోనాపురంలో గంగమ్మ తల్లి బోనాల పండుగను యాదవులు ఘనంగా నిర్వహించారు. తొలిఏకాదశి పర్వదినం సందర్భంగా యాదవులు ఆరాధ్య దైవం గంగమ్మ తల్లి ఆలయానికి మహిళలు అధిక సంఖ్యలో బోనాలతో తరలివెళ్లారు. గ్రామ శివారులోని దేవాలయానికి డప్పు చప్పుళ్లతో చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. చల్లంగా చూడాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద గొల్ల రాదారపు కుమారస్వామి, సారి గొల్ల ఆవుల మల్లయ్య, మాజీ ఎంపీటీసీ ఆవుల రాములు, కర్రె రమేష్, రాదారపు నాగరాజు, రవి, దొంగల మల్లయ్య, రాజుకుమార్, పర్కి అనిల్, రమేష్, సాంబయ్య, సాయిలు, ఐలయ్య ఉన్నారు.

పరామర్శ



అంతిమయాత్రలో పాల్గొన్న మాజీ మంత్రి ఎర్రబెల్లి, మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి

సంగెం : జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్‌రావు తండ్రి సుబ్బారావు అనారోగ్యంతో మంగళవారం సాయంత్రం మరణించారు. కాగా బుధవారం మండలంలోని గుంటూరుపల్లిలో సుబ్బారావు పార్థివదేహంపై మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. అనంతరం అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి

నర్సంపేట: జర్నలిస్టుల సంక్షేమానికి పాటుపడతామని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ -143 కన్వీనర్ బీఆర్.లెనిన్, వరంగల్ కన్వీనర్ కక్కెర్ల అనిల్‌కుమార్, కోకన్వీనర్ తుమ్మ శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు నర్సంపేటలో బుధవారం టీయూడబ్ల్యూజే సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురికి సభ్యత్వ రశీదులను అందజేశారు. అనంతరం నర్సంపేట నియోజకవర్గ జర్నలిస్టుల సమస్యలను పలువురు యూనియన్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో ఉగ్గిడి శివుడు, అబ్బు వెంకట్‌రెడ్డి, రడం శ్రీనివాస్, కారుపోతుల విజయ్‌కుమార్, గొడిశాల సదానందం, పుల్లూరి శ్రీనివాస్, బుర్ర వేణు, వడ్లకొండ రాజ్‌కుమార్, సొడారపు మధు, కుమార్, అనిల్, సాంబయ్య, ఆకుల అశోక్, రమేశ్, వీరాచారి, ప్రవీణ్‌గౌడ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

స్వర్గ రథం అందజేత



స్వర్గ రథం తాళాలు అందజేస్తున్న యాదవరెడ్డి

చెన్నారావుపేట : మండలంలోని పాపయ్యపేటకు చెందిన బైరి అచ్చిరెడ్డి-కాంతమ్మ దంపతుల జ్ఞాపకార్థంగా వారి కుమారుడు యాదవరెడ్డి-అరుణ దంపతులు స్వర్గ రథాన్ని బుధవారం అందజేశారు. యాదవరెడ్డి మాట్లాడుతూ గ్రామస్తులకు ఉపయోగపడే విధంగా ఈ వాహనం అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు బిల్లా ఇంద్రసేనారెడ్డి, మొగిళి కేశవరెడ్డి, సొసైటీ డైరెక్టర్ మజ్జిగ రాంబాబు, బుర్ర సుదర్శన్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, మండల రవి, వెంకటేశ్వర్లు, సమ్మయ్య, గ్రామ పాలకులు, పెద్దలు ఉన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి



నల్లబెల్లి: సమావేశంలో మాట్లాడుతున్న మహేందర్

నల్లబెల్లి : అశ్వరావుపేట ఎస్సై శ్రీనివాస్‌ది ప్రభుత్వ హత్యేనని, ఎస్సై ఆత్మహత్యకు పాల్పడేలా ఇబ్బందులకు గురి చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని అసైన్డ్ భూమి సమితి (ఏబీఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు కలకోటి మహేందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని నారక్కపేటలో బుధవారం నిర్వహించిన ఎస్సై శ్రీనివాస్ యాది సభకు ఆయన హాజరై, నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ.. సీఐ జితేందర్‌రెడ్డి, మరో నలుగురు కానిస్టేబుళ్ల వేధింపులతోనే శ్రీనివాస్ ఆత్మహత్యకు పాల్పడ్డారని ఆరోపించారు. దళిత అధికారులు నిజాయితీతో విధులను నిర్వర్తిస్తుంటే అగ్రవర్ణ, అగ్రకులాలకు చెందిన వారు జీర్ణించుకోలేక పోయారని విమర్శించారు. శ్రీనివాస్ మృతిపై సీబీఐతో విచారణ చేసి దోషులందరిని శిక్షించాలన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు చుంచు రాజేందర్, కొమ్ముల కరుణాకర్, బొౌతు రాధ, మాడుగుల సునీత పాల్గొన్నారు.


సీఐని విధుల నుంచి తొలగించాలి

పర్వతగిరి : ఖమ్మం జిల్లా అశ్వరావుపేట ఎస్సై శ్రీరాముల శ్రీనివాస్ ఆత్మహత్యకు కారకుడిగా అరోపణలు ఎదుర్కొంటున్న సీఐపై విచారణ పూర్తి చేసి విధుల నుంచి తొలగించి అతనిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని బహుజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలో స్వేరో, ఎస్ఎఫ్ఐ, ఎస్టీ, ఎస్టీ, ఎంప్లాయీస్ యూనియన్ సంఘాల ఆధ్వర్యంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వేరో జిల్లా సెక్రటరీ గారె జయరాజ్ మాట్లాడుతూ.. ఉన్నతాధికారుల వేధింపుల వల్ల ఆత్మహత్యకు పాల్పడిన ఎస్సై శ్రీనివాస్ సూసైడ్ నోట్ ఆధారంగా ఆరోపణలు ఎదుర్కొంటున్న సీఐపై ఇన్ని రోజులైన కేసు నమోదు చేయక పోవడం కుట్రపూరిత చర్య అని అన్నారు. ఎస్సై శ్రీనివాస్ పేర్లతో సహా వెల్లడించినప్పటికీ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. సీఐతో పాటు ఆత్మహత్యకు కారకులైన ఇతర పోలీసు అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని, ఎస్సై శ్రీనివాస్ కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా ఇవ్వడంతో పాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చుక్క ప్రశాంత్ మాట్లాడుతూ ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాల్సిన ఎస్సై ఉన్నతాధికారుల వేధింపులకు గురై ఆత్మహత్యకు పాల్పడడం అత్యంత విచారకరం అన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీస్ ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బానోత్ రమేష్, దినేష్, రాహుల్ పాల్గొన్నారు.

వేధింపులకు పాల్పడిన వారిని రిమాండ్‌కు తరలించాలి

నల్లబెల్లి : ఎస్సై శ్రీనివాస్ మృతికి కారణమైన సీఐ, కానిస్టేబుళ్లను రిమాండ్‌కు ఎందుకు తరలించడం లేదని ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నారాయణ అన్నారు. ఈ మేరకు మండలంలోని నారక్కపేట గ్రామంలో బుధవారం యూనియన్ ఆధ్వర్యంలో శ్రీనివాస్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు అయినప్పటికీ రిమాండ్‌కు ఎందుకు పంపడం లేదని ప్రశ్నించారు. మృతిచెందిన ఎస్సై శ్రీనివాస్ వాంగ్మూలం ఆధారంగా సీఐ జితేందర్‌రెడ్డి, సిబ్బందిని రిమాండ్‌కు తరలించకుంటే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బాధ్యులు పాల్గొన్నారు.

'ప్రేమోన్మాదిని ఉరితీయాలి'



పరామర్శిస్తున్న గోర్‌సేనా బృందం నాయకులు

చెన్నారావుపేట : మండలంలోని 16 చింతల్ తండాకు చెందిన బానోత్ శ్రీను-సుగుణను హత్య చేసిన ప్రేమోన్మాదిని ఉరితీయాలని గోర్ షిక్వాడీ, గోర్ సేనా జిల్లా అధ్యక్షుడు ధరావత్ కిషన్‌నాయక్, ఉపాధ్యక్షుడు కొర్ర శోభన్, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు బానోత్ సురేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు బాధిత కుటుంబాన్ని బుధవారం పరామర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి రోజు ఎక్కడో ఓ చోట గోర్ లపై హత్యలు, బలత్కారాలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రభుత్వాలు గోర్ సమాజము పట్ల సవతి ప్రేమ చూపుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులను కోల్పోయి అనాథలైన దీపిక, మదన్‌ను ప్రభుత్వం ఆదుకోవాలని, రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో భూక్య మత్రు రాథోడ్, జాటోత్ రమేష్, వెంకన్న, లవన్‌కుమార్, మధు, అనిల్, భాస్కర్, గణేష్ తదితరులు ఉన్నారు.

ముదిరాజ్‌ల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాజు

పర్వతగిరి : ముదిరాజ్ కులస్తుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని మెపా జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల రాజు ముదిరాజ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ ముదిరాజ్ కులస్తులను బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి మార్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నీరటి వెంకన్న, బొంత రాము, రావుల రాజు, తదితరులు పాల్గొన్నారు.

కుల గణన యాత్రను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డ్యాగల శ్రీనివాస్

నర్సంపేట : రాష్ట్రంలో సమగ్ర కులగణన చేపట్టి బీసీల జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు పెంచే వరకు ఉద్యమం కొనసాగుతుందని బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, నర్సంపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ డ్యాగల శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు పట్టణంలో బుధవారం సమావేశం నిర్వహించారు.అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికకు ముందు కామారెడ్డి సభలో సమగ్ర కులగణన చేపట్టి స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతానికి బీసీ రిజర్వేషన్లు పెంచుతామని స్పష్టమైన హామీ ఇచ్చిందన్నారు. ఆ హామీని గుర్తు చేయడానికి బీసీ డిక్లరేషన్ ప్రకటించిన కామారెడ్డి నుంచే బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ నేతృత్వంలో బీసీ కుల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఈనెల 14వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా 17రోజుల పాటు చేపట్టిన సమగ్ర కుల గణన యాత్రలో భాగంగా నేడు వరంగల్ హంటర్ రోడ్డులోని సత్యం కన్వెన్షన్ హాల్‌లో సమగ్ర కుల గణన యాత్ర సభ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ సభకు వరంగల్ జిల్లాతో పాటు నర్సంపేట నియోజకవర్గ వ్యాప్తంగా బీసీ కులాలకు చెందిన వారు కులాలు, పార్టీలకతీతంగా ఏకమై సమగ్ర కుల గణన సాధన యాత్ర సభలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బీసీ సంక్షేమ సంఘం నాయకులు చెన్నూరి రవి, ఓడపల్లి రమేష్, బేతి భాస్కర్, శీరంశెట్టి రాజేందర్, మర్రి క్రాంతి, బ్రహ్మచారి, యాట మోహన్, నీల సుధాకర్, కొలిపాక సుధాకర్, గొర్రె వినయ్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

సన్మానం

సంగెం : మండలంలోని గవిచర్లకు చెందిన రావుల వాణి అడిషనల్ గవర్నమెంట్ ప్లీడర్ (ఏజీపీ)గా నియమితులైన సందర్భంగా గ్రామానికి చెందిన పలువురు వాణి, శ్రీనివాస్‌రెడ్డి దంపతులను సన్మానించారు. బుధవారం హనుమకొండలోని వాణి నివాసంలో మాదిగ కులసంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎల్దొండ బాబు, భాషిపాక రమేష్ మర్యాదపూర్వకంగా కలుసుకుని శాలువా కప్పి, పూలబొకే అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. డైరెక్టర్లు రాజు, బుచ్చయ్య, వేల్పుల స్వామి, సదయ్య, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదు

పర్వతగిరి : మండలంలోని దేవీలాల్‌తండాకు చెందిన విద్యార్థిని అనుమానాస్పద స్థితిలో మృతి చెందగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జి.వెంకన్న తెలిపారు. ఐశ్వర్య తండ్రి మాన్య ఇటీవల ఐశ్వర్యతో నిశ్చితార్థం జరిగిన వ్యక్తిపై అనుమానం ఉన్నట్లు ఫిర్యాదు చేశాడని తెలిపారు.

రక్షణ కవచాలతో గీతకార్మికులకు భద్రత

ఖానాపురం : కల్లుగీత కార్మికులకు రక్షణ కవచాల పంపిణీతో ప్రమాదాల బారిన పడకుండా నివారించుకొనే అవకాశం ఉంటుందని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మోడెం ఎల్లగౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు శాఖమూరి ముఖేష్ చౌదరి అన్నారు. ఈ మేరకు బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. ప్రమాదాల బారిన పడి అనేక మంది గీత కార్మికులు మృత్యువాత పడిన సంఘటనలు ఉన్నాయన్నారు. గతంలో పెండింగ్‌లో ఉన్న రూ.7.90 కోట్ల నిధులను సైతం కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. రాష్ట్రంలోని కులవృత్తులను బలోపేతం చేయడానికి ప్రభుత్వం సహకారాన్ని అందిస్తోందన్నారు.

తొలిఏకాదశి పూజలు



నర్సంపేట : పట్టణంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీభూనీల సమేత వేంకటేశ్వర స్వామికి ఆలయ అర్చకులు ముడుంబై రామానుజచార్యులు పంచామృతం, పుష్పాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ చైర్మన్ ఎర్ర జగన్‌మోహన్‌రెడ్డి, కమిటీ సభ్యులు శింగిరికొండ రవీందర్, దామోదర్, రామగోని సుధాకర్, దోమకుంట్ల సతీష్, శ్రీనివాస్, సాన్యో శ్రీను పాల్గొన్నారు.

ఊరూరా పీరీల ఊరేగింపు





రాయపర్తి: పీరీలను ఊరేగిస్తున్న గ్రామస్తులు



చెన్నారావుపేట: అగ్నిగుండాన్ని పూడ్చి వేసిన భక్తులు

రాయపర్తి : హిందూ, ముస్లింలు కలిసి మతసామరస్యానికి ప్రతీకగా మొహర్రంను బుధవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండలకేంద్రంతో పాటు పెర్కవేడు, కొండూరు, కాట్రపల్లి, కొత్తూరు తదితర గ్రామాల్లో పీరీలను ఊరేగించగా భక్తులు మొక్కులు చెల్లించారు. ఈ కార్యక్రమాల్లో ముస్లింలు అబ్దుల్‌రహమాన్, ఎండీ ఉస్మాన్, లాలు మహమ్మద్, గౌస్‌ఖాన్, షకీల్ పాల్గొన్నారు.

చెన్నారావుపేటలో..

చెన్నారావుపేట : మొహర్రంను హిందూ, ముస్లింలు ఘనంగా నిర్వహించుకున్నారు. గ్రామాల్లో ప్రతిష్టించిన పీరీలను ఇంటింటికి తిప్పి బుధవారం తెల్లవారుజామున నీటిలో నిమజ్జనం చేశారు. అనంతరం పీరీల కొట్టాల ఎదుట తీసిన అగ్నిగుండాలను పూడ్చి వేశారు. అనంతరం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించి మొక్కులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో హిందూ, ముస్లింలు మహ్మద్ అయ్యూం, మహ్మద్ రఫి, కంది కృష్ణారెడ్డి, మాజీ జెడ్పీటీసీ జున్నూతుల రాంరెడ్డి, మాజీ సర్పంచ్ కుండె మల్లయ్య, ఎంఏ గఫార్, మహేందర్ రెడ్డి, అంకూస్, పాషా, సంపత్ ఉన్నారు.

మండలంలోని పలు గ్రామాల్లో..

దుగ్గొండి : మండలంలోని తిమ్మంపేట, రేబల్లె, మందపల్లి, మైసంపల్లి, దుగ్గొండి గ్రామాల్లో మొహర్రంను జరుపుకున్నారు. హసన్, హుస్సేన్‌ల త్యాగాలను స్మరిస్తూ పది రోజుల పాటు నిర్వహించిన వేడుకలు బుధవారం నిమజ్జంతో ముగిశాయి. సవార్ల(పీరీలు)ను గ్రామంలో ఊరేగింపుగా తీసుకెళ్తున్న క్రమంలో భక్తులు ఊదు, బెల్లం, సవార్లకు దట్టీలు, పూలమాలలు, కుడుకలు, కానుకలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో జబ్బార్, ఫారూఖ్, ఎస్‌కే షరీఫ్, సారయ్య, మొగల్‌సాబ్ హిమాంసాహెబ్, యాకూబ్ హుస్సేన్, ప్రభాకర్, రాజు, ఐలయ్య, షహనాజ్ బేగం, రాజమల్లు, భక్తులు పాల్గొన్నారు.

కల్లెడలో..

పర్వతగిరి : మండలంలోని కల్లెడ గ్రామంలో మొహర్రంను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పీరీల ముజేవార్లు హుస్సేన్, యాకూబ్‌పాషా, రఫీ, ఇబ్రహీం ఆధ్వర్యంలో పీరీలను ఊరేగిస్తూ గ్రామంలోని ఇంటింటికి తిరిగి ప్రజలకు ఆశీర్వచనాలు అందించారు.

సంగెం : మతసామరస్యానికి ప్రతీకగా జరుపుకునే మొహర్రంను బుధవారం ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని గవిచర్ల, ఎల్గూర్‌రంగంపేట, తీగరాజుపల్లి, చింతలపల్లి, నల్లబెల్లి, సంగెం తదితర గ్రామాల్లో పీరీలను డప్పు చప్పుళ్లతో ఊరేగించారు. ఇంటింటి వెళ్లి మహిళలు, పిల్లలకు, కుటుంబసభ్యులకు పీరీలతో దువా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ముస్లింలు, యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



పర్వతగిరి: కల్లెడలో పీరీలను ఊరేగిస్తున్న భక్తులు



సంగెంలో..



దుగ్గొండి: రేబల్లె గ్రామంలో..

మద్యం తాగి వాహనాలు నడపొద్దు



నర్సంపేట రూరల్ : మద్యం తాగి వాహనాలను నడిపితే ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, మద్యం తాగిన వారు వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని నర్సంపేట టౌన్ సీఐ రమణమూర్తి తెలిపారు. ఈ మేరకు నర్సంపేట పట్టణంలో వరంగల్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు బయోమెట్రిక్ ద్వారా పాత నేరస్తుల గుర్తింపు, వాహనాల తనిఖీని బుధవారం సాయంత్రం నిర్వహించారు. అనంతరం డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. సరైన పత్రాలు లేని వాహనాలను, హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనం నడుపుతున్న వాహదారులకు జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు.